# రాజు-ప్రజలు

బండారు రామ్మోహన్ రావు

వెనకటికో కథ ప్రచారంలో ఉంది. దేవుడు మొదట రాజును సృష్టించాడు. ఆ రాజుకు చుట్టూరా చెట్లు-చేమలూ రాళ్ళూ-రప్పలూ, కొండలూ-కోనలూ, వాగులూ-వంకలూ కనిపించాయి. ప్రజలు మాత్రం కనిపించలేదు. తాను పరిపాలించడానికి అసలు ప్రజలే లేరని తెలుసుకొన్న రాజు మళ్లీ దేవుని ప్రార్థించాడు. అప్పుడు దేవుడు ప్రత్యక్షమై రాజు మొర విని ప్రజలని సృష్టించి రాజ్యమేలమన్నాడు. ఆ ప్రజలు రాజుకు విధేయులై- రాజు తప్ప తమకు మరో దేవుడు లేడనీ, రాజు భగవంతుడితో సమానమనీ, రాజు లేనిదే తమకు మనుగడ లేదనీ భావిస్తూ రాజు కోసమే బ్రతుకుతూ రాజు కోసమే చస్తున్నారట! ఇదీ ఆ కథ సారాంశం. ఇది రాజు కోసం సృష్టించబడ్డ ప్రజల కథ.

మరి మనది ప్రజాస్వామ్యం. ఇక్కడ ప్రజలకోసం పాలకులా, పాలకులకోసం ప్రజలా అన్నది ఆలోచించాలి.

స్వతంత్రం వచ్చాక మనదేశంలో పార్లమెంటుకు 15 సార్లు, అసెంబ్లీలకి 14 సార్లు ఎన్నికలు జరిగాయి జరుగుతున్న ఎన్నికల తతంగాన్నీ, పార్టీ ప్రచారాలనూ ఎప్పటికప్పుడు పరికిస్తే, నాయకులకోసమే ప్రజలా అని అనుమానం వస్తుంది. ఎన్నికలు పార్టీల కోసమే అనిపిస్తుంది.

పూర్వం రాజ్యం అవతరించడానికి చాలా పరిమిత కారణాలు ఉన్నాయి. అప్పటి సమాజ అవసరాలు కూడా పరిమితమయినవే. స్వంత ఆస్తి లేని సమాజంనుండి ఇంటి చుట్టూరా కంచె నిర్మించుకొన్నప్పుడే ఆ కంచె రక్షణకు- రాజ్యం అవసరమైంది. వ్యక్తిగత, సామూహిక భద్రత, ఆస్తి పరిరక్షణ- ఆనాడు రాజ్యం నిర్వహించిన ప్రధానవిధులు. ప్రక్కనే ఉండే మరో గణంనుంచో, మానవసమూహంనుంచో రక్షణ, భద్రత కూడా కావాల్సి వచ్చినపుడు రాజ్యం అవసరమైంది. ఇదే రాజ్యావతరణకు నాంది. ఆ తర్వాత రాజ్యం పరిధులు విస్తరించాయి.

భోజనాన్నిమన జిహ్వాకు తగ్గట్టు ఎన్నుకొంటాం. మన పిల్లల పెళ్లిళ్లు చేయాలంటే మన కుటుంబసభ్యులతోనూ, దగ్గర బంధువులతోనూ ఆలోచన చేస్తాం. ఇలా మన ఇంటి వరకూ మనమే నిర్ణయాలు తీసుకున్నా- ఇంటిముందు వీధి విషయానికొస్తే- మనమొక్కరమే ఆలోచిస్తే సరిపోదు. మన వీధిలో మురుగుకాల్వగురించో మన ఇంటిముందు రోడ్డుగురించో మనమొక్కరం ఏం చెయ్యలేం కదా! అలాగే మన పిల్లలకోసం స్వంతంగా స్కూల్ పెట్టుకోలేం. ఆరోగ్య కేంద్రమైతే అసలు కట్టుకోలేం. టీచర్లు, డాక్టర్ల జీతాలు మనం స్వంతంగా ఇవ్వలేం. అంటే వ్యక్తి, కుటుంబం తరవాత సామూహిక అవసరాలు మొదలై పరిధి పెరుగుతూ పోతూంటే- వాటి పరిష్కారాల పరిధి కూడా గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం, దేశం దాకా విస్తృతమైపోతుంది.

విస్తరించిన పరిధులమేరకు రాజ్యం-రాజకీయాలూ పనిచేయటం లేదనే ఇప్పటి మన ఆవేదన. రాజకీయం నిర్వహించాల్సిన పాత్ర నిర్వహించడంలేదనే మన ఆందోళన. ఈ ఆవేదనకూ, ఆందోళనకూ అర్థం ఉంది. అందుకే రాజకీయాలను మరో మారు నిర్వచించాల్సి

వస్తోంది. రాజకీయం సమాజహితంకోసమని మరోమారు చాటాలి. రాజకీయమంటే సేవ. రాజకీయమంటే వ్యక్తి స్వార్థాన్నీ, సమాజహితాన్నీ అనుసంధానించేదిగా ఉండాలి. అపరిమితమైన మన కోరికలకీ పరిమితమైన వనరులకీ సమన్వయంగా పరిష్కారం చూపించేదీ, ప్రజల మేలు కోరేదీ మాత్రమే నిజమైన రాజకీయం అని చెప్పాలి.

సమాజాన్నిబట్టే రాజకీయాలుంటాయంటారు. అలాగే రాజకీయాన్ని బట్టే ఆయా సమాజాల స్థితిగతుల్నీ, సమాజ చైతన్యాన్నీ అంచనా వేయవచ్చు అంటారు. రాజకీయం చేయాల్సిన పని చేయకపోతే అభివృద్ధి ఆగిపోతుంది. సగటు మనిషి జీవితంలో ఒడిదుడుకులు ఏర్ప డతాయి. అందుకే మనిషి జీవితంలో రాజకీయాలతో ముడిపడని అంశమే లేదన్నారు గాంధీజీ.

రాజకీయం సక్రమంగా లేకపోతే సమాజాన్ని నిందించి లాభంలేదు. ఎన్నికల వ్యవస్థ విఫలమైతే–ప్రజాస్వామ్యాన్ని నిందించి ప్రయోజనం లేదు. ప్రజాస్వామ్యం మూలమైతే–ఎన్నికలూ, రాజకీయాలూ, నాయకులూ ప్రజాస్వామ్యంలో లక్ష్యాలు చేరుకొనే మార్గాలూ, వాహకాలూను. లక్ష్యాలను చేరుకోడానికి ఒక మార్గం మూసుకుపోతే మరో మార్గాన్ని మనమే వెతుక్కోవాలి. వాహనం పాడైతే మరో వాహనం ఎక్కాలి.

ప్రజాస్వామ్యంలో లోపాలుంటే మనమే వాటిని దిద్దుకోవాలి. ప్రజాస్వామ్యంలో సమస్యలకు మరింత ప్రజాస్వామ్యమే కావాలి. ఎన్నికలు రాజకీయాలకోసం కాదు. పార్టీలకోసమో నాయకులకోసమో అసలేకాదు. రాజకీయాలు ప్రజలకోసం కావాలి. దానికి ప్రజల కోసమే రాజకీయాలూ, ఎన్నికలూ జరిగే నూతన రాజకీయ సంస్కృతిని మనం నిర్మించాలి.

---()---